# ఎయిడ్స్ వ్యాధిపట్ల అవగాహన అవసరం

## జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి భానుమతి


సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, జడ్జి భానుమతి

కొత్తగూడెం టౌన్, డిసెంబర్ 1 : ఎయిడ్స్‌రహిత సమాజ స్థాపనకు అందరూ కృషి చేయాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి భానుమతి అన్నారు. డిసెంబర్ 1వ తేదీన ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా శుక్రవారం ప్రభుత్వ జూనియర్ కాలేజీలో చుంచుపల్లిలో ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో న్యాయమూర్తి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఎయిడ్స్ బారిన పడకుండా జాగ్రత్త పాటించాలని తెలిపారు. యుక్త వయస్సు వారు సరైన అవగాహన లేకపోవడం వల్ల ఈ మహమ్మారి బారినపడి జీవితాలను నాశనం చేసుకుంటున్నారని, ఎయిడ్స్ సోకిన వారిని చులకనగా చూడవద్దని, వారిపట్ల వివక్ష చూపరాదని అన్నారు. కొత్తగూడెం ప్రభుత్వ ఆస్పత్రిలో చర్మ వ్యాధుల డాక్టర్ మోహన్‌కృష్ణరెడ్డి హెచ్ఐవీ ఎయిడ్స్ వ్యాధి గురించి వివరించారు. యువత గంజాయి, డ్రగ్స్ లాంటి మాదక ద్రవ్యాలకు బానిసలు కావొద్దని సూచించారు. ఎయిడ్స్ వ్యాధి పట్ల ఏమైనా అనుమానం ఉంటే తక్షణమే పరీక్షలు చేయించుకోవాలన్నారు. యువత చెడు మార్గాలను ఎంచుకొని హెచ్ఐవీ ఎయిడ్స్ బారిన పడుతున్నారని, కలిసి ఉండటం, కలిసి భుజించడం వల్ల వ్యాధి సోకతదని, రక్తమార్పిడి, సూదులు, లైంగిక సంబంధాలు వల్ల వ్యాధి సోకుతుందన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రమేశ్‌కుమార్ మక్కడ్, జనరల్ సెక్రటరీ రామారావు, చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ పురుషోత్తంరావు, డిప్యూటీ లీగల్ ఎయిడ్ కౌన్సిల్ నిరంజన్‌రావు, న్యాయవాదులు సత్యనారాయణ, రాజమల్లు, శ్రీనివాసరావు, ప్రిన్సిపాల్ జే.రమేశ్, అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ కౌన్సిల్స్ జ్యోతి విశ్వకర్మ, నాగ స్రవంతి, అధ్యాపకులు పాల్గొన్నారు.

### పెనగడప పీహెచ్‌సీలో..

చుంచుపల్లి, డిసెంబర్ 1 : మండలంలోని పెనగడప ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ నేహా అమ్రిన్, డాక్టర్ గీతామాధురి ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది, ఏఎన్ఎంలు అందరూ కలిసి గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఎయిడ్స్ పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని, ఎయిడ్స్ బాధితులను ఆదరించాలని, వారిని నెట్టివేయవద్దన్నారు. కార్యక్రమంలో హెచ్ఈవో, హెల్త్ సూపర్‌వైజర్లు, ఆస్పత్రి సిబ్బంది, పీహెచ్‌సీ ఫీల్డ్ స్టాఫ్ పాల్గొన్నారు.

### మహిళా కళాశాలలో..

కొత్తగూడెం ఎడ్యుకేషన్, డిసెంబర్ 1 : స్థానిక సింగరేణి మహిళా డిగ్రీ, పీజీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ యూనిట్స్ ఆధ్వర్యంలో ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవాన్ని నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ పీవోలు, వలంటీర్లు ఎయిడ్స్‌పై అవగాహన కల్పిస్తూ నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. సింగరేణి హెడ్డాఫీస్ ఎదుట మానవహారం చేశారు. ప్రిన్సిపాల్ శారద మాట్లాడుతూ ఎయిడ్స్ వ్యాధి వ్యాప్తి నివారణలో ప్రతి ఒక్కరూ తమవంతు కృషి చేయాలన్నారు. గ్రామాల్లో వ్యాధి నిర్మూలనపై అవగాహన కల్పిస్తూ వ్యాధితో పోరాడుతున్న బాధితులకు భరోసా కల్పించాలనే ఉద్దేశంతో ప్రతి ఏడాది డిసెంబర్ 1వ తేదీన ప్రపంచ ఎయిడ్స్‌డే నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పీవోలు సునీత, ఆశాజ్యోతి, సుమలత పాల్గొన్నారు.

### జూలూరుపాడులో..

జూలూరుపాడు, డిసెంబర్ 1 : ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా మండల కేంద్రంలో స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. వైద్యులు రాకేశ్, తేజస్వీ, వైద్య సిబ్బంది వెంకటేశ్వర్లు, రత్నకుమార్, సుభద్ర, హఫీజ్, రత్నకుమార్ కృష్ణ పాల్గొన్నారు.

### డిగ్రీ కాలేజీ విద్యార్థుల ర్యాలీ

పాల్వంచ రూరల్, డిసెంబర్ 1 : ఎయిడ్స్‌రహిత సమాజం కోసం అందరూ కృషి చేయాలని, ఎయిడ్స్ వచ్చిన వారిపట్ల సానుభూతితో యువత వ్యవహరించాలని డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చిన్నప్పయ్య అన్నారు. మండలంలోని లక్ష్మీదేవిపల్లి(ఎస్) ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులకు శుక్రవారం ఎయిడ్స్ వ్యాధి పట్ల అవగాహన కల్పించి ర్యాలీ నిర్వహించారు. యువత సత్ప్రవర్తన కలిగి చెడు అలవాట్లకు దూరంగా ఉండాలన్నారు. యువకులు అవగాహన కలిగి ఉండి రక్త మార్పిడి సమయంలో జాగ్రత్త వహించాలని సూచించారు. కార్యక్రమంలో అధ్యాపకులు విజయ్‌కుమార్, ఎన్.శ్రీదేవి, శ్రీలీల, సౌమ్య, విజయజోషి, భాస్కర్‌రావు, హారిక పాల్గొన్నారు.


పాల్గొన్న న్యాయవాదులు, విద్యార్థులు, అధ్యాపకులు


చుంచుపల్లి : ఎయిడ్స్ ర్యాలీలో పాల్గొన్న వైద్య సిబ్బంది



జూలూరుపాడులో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది






కొత్తగూడెం ఎడ్యుకేషన్ : ఎయిడ్స్ డే ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థినులు, అధ్యాపకులు



పాల్వంచ రూరల్ : ప్రిన్సిపాల్ చిన్నప్పయ్య ఆధ్వర్యంలో ర్యాలీ

## పెద్దమ్మతల్లికి పంచామృతాభిషేకం


పంచామృతాభిషేకం జరుపుతున్న అర్చకులు

పాల్వంచ రూరల్, డిసెంబర్ 1 : మండలంలోని కేశవాపురం–జగన్నాధపురం గ్రామాల మధ్య ఉన్న పెద్దమ్మతల్లి ఆలయంలో శ్రీకనకదుర్గ అమ్మవారికి అర్చకులు శుక్రవారం పంచామృతాభిషేకం జరిపారు. ఉదయం ఆలయం ఎదురుగా ఉన్న అమ్మవారి జన్మస్థలం వద్ద ప్రత్యేక పూజలు చేసి అమ్మవారికిష్టమైన పసుపు, కుంకుమ, గాజులు, ఒడిబియ్యం సమర్పించారు. ఆలయంలోని మూలవిరాట్‌కు పంచామృతాలతో అభిషేకం చేసి, పంచహారతులు, నివేదన, నీరాజన మంత్రపుష్పం పూజలు నిర్వహించారు. పంచహారతుల కార్యక్రమంలో భక్తులు అధికసంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ధర్మకర్తలు సువాలీ, వెంగళరావు, నాగమల్లేశ్వరరావు, విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

## బాలుర వసతిగృహాన్ని సందర్శించిన జడ్జి


మాట్లాడుతున్న జడ్జి భానుమతి

చుంచుపల్లి, డిసెంబర్ 1 : జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి జి.భానుమతి శుక్రవారం తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్, జూనియర్ కాలేజీలను ఆకస్మికంగా సందర్శించారు. విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలపై ఆరా తీశారు. మెరుగైన సదుపాయాలు కల్పించాలని ఆదేశించారు. వసతి గృహం కిచెన్, తరగతి గదులు, కిచెన్‌రూం, స్టోర్ రూమ్‌లను న్యాయమూర్తి పరిశీలించారు. పారిశుధ్యంపై ప్రత్యేక చర్యలు తీసుకోవాలని హాస్టల్ సిబ్బందిని ఆదేశించారు. సౌచాలయాలు, వసతిగృహ ఆవరణం శుభ్రంగా లేకపోవడంతో న్యాయమూర్తి అసహనం వ్యక్తంచేశారు.


మార్కెట్ ముఖద్వారం నిర్మాణ పనులు

## ఖమ్మం మార్కెట్‌కు
# కొత్త సొబగులు

- రూ.10 కోట్లతో ఆధునీకరణ పనులు
- శరవేగంగా సాగుతున్న నిర్మాణాలు
- సంతోషం వ్యక్తం చేస్తున్న రైతులు

ఖమ్మం వ్యవసాయం, డిసెంబర్ 1 : ఖమ్మం వ్యవసాయ మార్కెట్ సరికొత్త సొబగులు సంతరించుకోబోతున్నది. యావత్ తెలంగాణలోనే అతిపెద్ద మార్కెట్లలో ఒకటైన ఖమ్మం మార్కెట్‌కు మరింత శోభ రానున్నది. కొద్దినెలల క్రితమే మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ స్వీయ ఆలోచన ఫలితంగా ఆధునిక మోడల్ మార్కెట్ నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. తద్వార జిల్లా రైతాంగంతోపాటు, పొరుగుజిల్లాల రైతులకు మరిన్ని సౌలతులు అందుబాటులోకి రాబోతున్నాయి. ఇప్పటికే మార్కెట్ పరిధిలోని మిర్చి, అపరాలు, పత్తి పంటకు వేర్వేరుగా యార్డులు అందుబాటులో ఉన్నాయి. అయితే గత కొద్ది సంవత్సరాలుగా పంట దిగుబడులు పెరగడంతో యార్డుల విస్తీర్ణం మరింత పెంచేందుకుగాను మార్కెట్ పాలకవర్గం పలు నిర్ణయాలను తీసుకున్నది. అందులో భాగంగా ఇప్పటికే మార్చి యార్డులో పురాతన భవనాలను పూర్తిగా తొలగించారు. వాటి స్థానంలో నూతన భారీ షెడ్లు, యార్డులకు సంబంధించిన ముఖద్వారాలు, మార్కెట్ పరిసర ప్రాంతాల్లో ఆధునీకణతో కూడిన సీసీ రోడ్లు, సైడు కాల్వల నిర్మాణాలు, రైతు విశ్రాంతి భవనం, మార్కెట్ కమిటీ కార్యాలయం భవనం ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఇప్పటికే మంత్రులు, పువ్వాడ అజయ్‌కుమార్, సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి సదరు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసిన సంగతి తెలిసిందే. గడిచిన రెండునెలల నుంచి నిర్మాణ పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి.

### మిర్చి సీజన్ నాటికి సర్వం సిద్ధం


నూతన షెడ్ల నిర్మాణాలు

కొద్దిరోజుల్లో మార్కెట్‌కు వానకాలం మిర్చి పంట చేతికి వచ్చే అవకాశం ఉంది. ఇప్పటికే నగర మార్కెట్‌కు పత్తిపంట రావడం ప్రారంభమైంది. అయితే నిర్మాణ పనులు మిర్చియార్డులో జరుగుతున్నందున రైతులు, వ్యాపారులు, కార్మికులకు ఎలాంటి ఇబ్బంది రాకుడదనే ఉద్దేశంతో అధికారులు పనులను ముమ్మరం చేశారు. మార్కెట్ ముఖద్వారం నుంచి అగ్నిమాపక కేంద్రం వరకు రెండు లైన్ల సీసీ రోడ్డు నిర్మాణం పూర్తి చేశారు. దీంతో నిత్యం మార్కెట్‌కు పంటను తీసుకొచ్చే వాహనాలకు ఇబ్బందులు తొలిగాయి. మిగిలిన మిర్చియార్డులో ఏర్పాటు కాబోతున్న రెండు బారీ షెడ్లు నిర్మాణాలు తుది దశకు చేరాయి. ఒకవైపు మార్కెట్ పరిసర ప్రాంతాల్లో డబుల్ లైన్ల రహదారులు, యార్డుల్లో నూతన షెడ్లు ఏర్పాటు చేస్తుండటంతో పంటను మార్కెట్‌కు తీసుకొస్తున్న రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. అకాల వర్షాలు వచ్చినప్పటికీ పంటకు ఎలాంటి ఇబ్బంది ఉండబోదని వారు ధీమా వ్యక్తం చేస్తున్నారు. నిర్మాణపనులు శరవేగంగా జరిగేవిధంగా మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ దోరెపల్లి శ్వేత, సెక్రటరీ ఆర్.మల్లేషం నిత్యం పర్యవేక్షణ చేస్తున్నారు.

### మార్కెట్ చరిత్రలోనే భారీ నిర్మాణాలు




నగర వ్యవసాయ మార్కెట్‌కు దాదాపుగా 80 ఏండ్ల చరిత్ర ఉంది. ఈ దశాబ్దాల కాలంలో మార్కెట్ అభివృద్ధికి నాటి ప్రభుత్వాలు ఎలాంటి ఆలోచన చేయలేదు. మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ స్వయంగా అనేకసార్లు మార్కెట్‌ను సందర్శించి మార్కెట్ ఆధునీకరణ గూర్చి వర్తకసంఘం వ్యాపారులు, కార్మిక సంఘాల నేతలతో చర్చించారు. ఫలితంగా ఒక్కటికాదు రెండు రూ.10 కోట్ల నిధులను మంజూరు చేయించడంతోపాటు నిర్మాణ పనులను ప్రారంభించారు. దీంతో యార్డు విస్తీర్ణం మరింత పెరగనున్నది. కొత్తగా మరో 150మందికి కమీషన్ లైసెన్స్‌లను సైతం అందించడం జరిగింది. మార్కెట్ అభివృద్ధికి, వ్యాపారుల ఇబ్బందులను తొలగించిన మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్‌కు పాలక వర్గం, కార్మికులు, రైతుల తరపున ప్రత్యేక కృతజ్ఞతలు.

– దోరెపల్లి శ్వేత, ఖమ్మం ఏఎంసీ చైర్‌పర్సన్